సాక్షి
అనంతపురం
మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



టమాట కిలో రూ. 12

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్ఠం రూ.5, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి

గరిష్ఠం/కనిష్ఠం
38.4°/20.8°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

మార్కెట్‌కు 2,320 క్వింటాళ్ల చింతపండు



మార్కెట్‌కు వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం 2,320 క్వింటాళ్ల చింతపండు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. కరిపులి రకం (ప్రథమశ్రేణి) క్వింటా గరిష్ఠంగా రూ.24 వేలు, కనిష్ఠంగా రూ.8,500, సగటున రూ.10 వేల ప్రకారం పలికిందన్నారు.అలాగే ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్ఠంగా రూ.9,500, కనిష్ఠంగా రూ.4,150, సగటున రూ.36 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి. బోటు రకం క్వింటా గరిష్ఠంగా రూ.3,700, కనిష్ఠంగా రూ.2 వేలు, సగటు రూ.3 వేల ప్రకారం క్రయవిక్రయాలు సాగాయి.

రేపు ధ్రువపత్రాల పరిశీలన

అనంతపురం అర్బన్: పౌర సరఫరాల సంస్థలో పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారి ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈనెల 28న నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా మేనేజర్ రమేశ్‌రెడ్డి సోమవారం తెలిపారు. రెండు అకౌంటెంట్, ఒక టెక్నికల్ అసిస్టెంట్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో 28వ తేదీ ఉదయం 10 గంటలకు బుడ్డప్పనగర్‌లోని కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

ఇద్దరు దొంగలకు జైలు శిక్ష



యాడికి: దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ తాడిపత్రి జేఎఫ్‌సీఎం చంద్రశేఖరరెడ్డి తీర్పు వెలువరించారు. యాడికి సీఐ నాగార్జున రెడ్డి తెలిపిన మేరకు... గత ఏడాది నవంబర్‌లో యాడికి మండలం కుర్మాజీపేటకు చెందిన శ్రీనివాసులు ఇంట్లో దుండగులు చొరబడి 5 తులాల బంగారు నగదు, సెల్‌ఫోన్‌ను అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేసిన యాడికి ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి పక్కా ఆధారాలతో యాడికికి చెందిన జోగి రాజా, అనంతపురం నివాసి షేక్ ఇబ్రహీంను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు తాడిపత్రి జేఎఫ్‌సీఎం కోర్టులో తుది విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో ఇద్దరికీ ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి చంద్రశేఖరరెడ్డి సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున వాదనలను పీపీ సురేఖ వినిపించారు.

డిప్యూటీ సీఈఓపై విచారణకు ఆదేశం

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ లలితబాయిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ సీఈఓ గత ఏడాది జూన్, జూలై నెలల్లో పొందిన అలవెన్సులతో పాటు అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు కర్నూలు జిల్లా తుగ్గలి మండలం బొందిమడుగుకు చెందిన రమేశ్ అనే వ్యక్తి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు జెడ్పీ వర్గాలు తెలిపాయి. దీనిపై సమగ్ర విచారణ చేసి, నివేదిక ఇవ్వాల్సిందిగా జిల్లా కలెక్టర్ గౌతమిని కమిషనర్ సోమవారం ఆదేశించారు.

పాడి ఆవుకు ప్రాణదానం



పాడి ఆవుకు వైద్యం చేస్తున్న ఏడీ పద్మనాభం

అనంతపురం అగ్రికల్చర్: పశుశాఖ వైద్యాధికారులు సోమవారం పాడి ఆవుకు ప్రాణదానం చేశారు. కంబదూరు మండలం గూళ్యం గ్రామం రైతు బాలప్పకు చెందిన రూ. 80 వేలు విలువ చేసే పాడి ఆవు మూడు రోజులుగా మేత, నీరు తీసుకోలేక ఇబ్బంది పడుతోంది. ఏదైనా ఆహారం తీసుకున్న వెంటనే వాంతి చేసుకుంటోంది. ఆందోళన చెందిన రైతు స్థానిక పశువైద్యులను సంప్రదించడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సాయినగర్ పశువైద్యశాలకు తీసుకువచ్చారు. శింగనమల పశువైద్యాధికారి, ఏడీ పద్మనాభం ఆధ్వర్యంలో పరీక్షించారు. ఆహార నాళంలో అడ్డు ఉన్నట్లు గుర్తించి 'నెగిటీవ్ ప్రెషర్ సక్షన్' విధానంలో ఆహార నాళాన్ని శుభ్రం చేశారు. పాడి ఆవు వెంటనే నీరు, గడ్డి కోసం వెంపర్లాడడంతో రైతు ధన్యవాదాలు తెలిపారు.

పింఛన్లలోనూ పెద్దపీట

"బీసీలంటే బ్యాక్ వర్డ్ కాదు.. బ్యాక్ బోన్ క్లాస్'' అని కొత్త నిర్వచనం చెప్పిన సీఎం వైఎస్ జగన్.. ఆచరణలోనూ నిరూపిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయంగా ఆ వర్గాలకు పెద్ద సంఖ్యలో పదవులు కట్టబెట్టారు. సముచిత స్థానం కల్పించారు. అదే క్రమంలో సంక్షేమ పథకాల్లోనూ వారికే అగ్ర తాంబూలం వేశారు. సామాజిక పెన్షన్లలో జిల్లాలో రమారమి 60 శాతం మంది లబ్ధిదారులు బీసీలే ఉన్నారంటే ఎంతగా ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఎన్నడూ ఇంత పెద్ద స్థాయిలో బీసీలకు లబ్ధి జరగలేదంటే అతిశయోక్తి కాదు.

- బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ విశేష ప్రాధాన్యం
- జిల్లాలో 2.90 లక్షల మందికి పెన్షన్ కానుక
- అందులో 60 శాతం బీసీ వర్గాల వారే
- నెలకు రూ.52.27 కోట్ల మేర పంపిణీ
- గతంలో ఎన్నడూ లేని విధంగా అడుగడుగునా చేయూత



సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో 2.90 లక్షల మంది పెన్షన్‌దారులు ఉన్నారు. ఇందులో 1.74 లక్షల మంది బీసీ వర్గానికి చెందిన మహిళలు, వృద్ధులు, వితంతువులు కావడం గమనార్హం. జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ పెన్షన్ కానుక కింద ప్రతి నెలా రూ.87.11 కోట్లు పంపిణీ చేస్తుండగా, అందులో అత్యధికంగా రూ. 52.27 కోట్లు బీసీ కులాలకు చెందిన లబ్ధిదారులకు చేరుతోంది.

టీడీపీ హయాంలో అవస్థలు

2019కి ముందు ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం పెన్షన్లు 1.10 లక్షలు కూడా లేవు. పైగా అప్పట్లో కొత్తగా పెన్షన్ మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేది. ఒక వేళ మంజూరైనా నెలా నెలా డబ్బు అందుకునేందుకు మరిన్ని అవస్థలు పడాల్సిన పరిస్థితి. పంచాయతీ కార్యాలయాల వద్ద అధికారుల కోసం పడిగాపులు కాస్తూ, వారు మాటలు అన్నా పడుతూ నగదు అందుకోవాల్సిన దుస్థితి.

జిల్లాలో పెన్షన్ కానుక ఇలా

కేటగిరీ	లబ్ధిదారుల సంఖ్య	నెలకు అందిస్తున్న సొమ్ము (రూ.కోట్లలో)
బీసీలు	1,74,391	52.27
ఓసీలు	55,645	16.56
ఎస్సీలు	50,174	15.08
ఎస్టీలు	10,646	03.19
మొత్తం	2,90,856	87.11

పెన్షన్లు పెంచి.. ఠంచనుగా ఇచ్చి..

చంద్రబాబు పాలనతో విసిగి వేసారిన ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. అఖండ మెజార్టీతో వైఎస్ జగన్‌ను సీఎం చేసుకున్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని ఆయన వమ్ము చేయలేదు.పార్టీలు,కులాలు,మతాలు చూడకుండా, తమ పార్టీకి ఓటు వేసినా, వేయకపోయినా అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేశారు. వలంటీర్లను ఏర్పాటు చేసి సంక్షేమ ఫలాలను ఇంటి వద్దకే చేర్చారు. అవ్వతాతలకు ఇబ్బంది లేకుండా వారు ఎక్కడ ఉంటే అక్కడికే వెళ్లి పింఛన్ డబ్బు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ను రూ. 3 వేలకు పెంచి లబ్ధిదారులకు సంతోషం పంచారు.

పెద్దన్నలా ఆదుకుంటున్నారు



నాకు దివ్యాంగ పింఛను రూ.3,000 వస్తోంది. మా ఇంట్లో మొత్తం నలుగురు ఉంటున్నాం. ప్రతి నెలా అందించే పింఛను కుటుంబ అవసరాలకు బాగా ఉపయోగపడుతోంది. మాలాంటి వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దన్నలా మారారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేసి మరింత సంతోషం పంచారు.

– రమేష్, కురాకులతోట, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ

రుణపడి ఉంటాం



గతంలో పింఛన్ పొందేందుకు అర్హత వయసు 65 సంవత్సరాలుండేది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తరువాత 60 సంవత్సరాలకు తగ్గించడంతో నాకు పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి రూ.3 వేలు అందిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీలకు అండగా నిలిచిన సీఎం రుణం తీర్చుకోలేనిది.

– కొత్తపల్లి బోయ చితంబరి, శింగనమల

కొడుకులా చేయూతనిస్తున్నారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్ అందిస్తూ ఓ కొడుకులా చేయూతనిస్తున్నారు. పింఛన్ సొమ్మును ప్రతి నెలా మందులు కొనేందుకు, ఇతర ఖర్చులకు వాడుకుంటున్నా. ప్రతి నెలా ఒకటో తేదీనే అందిస్తూ నాలాంటి ఎంతో మంది నిస్సహాయులను ఆదుకుంటున్నారు.

– కురుబ లక్ష్మిదేవి, తగ్గుపర్తి, బెళుగుప్ప మండలం

'ఎవరికో టికెట్ ఇస్తే ఎలా సహకరిస్తాం?'

- గ్రామాల్లో అమిలినేని ఫ్లెక్సీలు కట్టడంపై ఉన్నం, ఉమా వర్గీయుల ఆగ్రహం

కంబదూరు: పార్టీలో కష్టపడి పని చేసిన వారికి టికెట్ ఇవ్వకుండా ఎక్కడో ఉన్న వారికి ఇస్తే సహకరించేది లేదని పలువురు టీడీపీ నాయకులు కుండబద్దలు కొట్టారు. టీడీపీలో టికెట్ ప్రకంపనలు కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబుకు కళ్యాణదుర్గం సీటు కేటాయించడంతో మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి, ఇన్‌చార్జ్ ఉమా మహేశ్వరనాయుడు వర్గీయులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలోనే సురేంద్ర బాబు ప్రచారానికి దిగి ప్రతి గ్రామంలో ఫ్లెక్సీలు కట్టిస్తుండడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఈ కార్యక్రమాన్ని మండలంలోని అచ్చంపల్లి, చెన్నంపల్లి, కురాకుల పల్లి, డీ.చెన్నేపల్లి, కదిరి దేవరపల్లి తదితర గ్రామాల్లో ఉన్నం, ఉమా వర్గీయులు అడ్డుకున్నారు. ''మేం మిమ్మల్ని ఎన్నడూ చూడలేదు. ఎవరో కూడా తెలియదు. ఇప్పుడు గ్రామాల్లోకి వచ్చి ఫ్లెక్సీలు ఎలా కడతారు'' అంటూ ప్రశ్నించారు. గ్రామంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఫ్లెక్సీలు కట్టడానికి వీలు లేదని తెగేసి చెప్పారు. దీంతో అమిలినేని వర్గీయులు వెనుదిరిగారు.

3న స్కూల్ అసిస్టెంట్లకు పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతుల కోసం అవసరమైన ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్–2024 పరీక్షలు మార్చి 3న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మీ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. తిరుపతి, రాజమండ్రిలో కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్‌టికెట్లు www.bse. ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారని తెలిపారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు

- అధికారులకు జేసీ కేతన్‌గార్గ్ ఆదేశం
- 'స్పందన'లో 287 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం అర్బన్: 'సమస్యను పరిష్కరిస్తారనే ఆశతో ప్రజలు మన వద్దకు వస్తారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యను పరిష్కరించాలి.' అని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు జెడ్పీ సీఈఓ వైభోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్లు వరప్రసాద్, ఆనంద్ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 287 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో జేసీ సమీక్షించారు. నిర్లక్ష్యం చేయకుండా ప్రతి అర్జీకి సంతృప్తికర పరిష్కారం చూపాలని ఆదేశించారు. సిబ్బందితో రోజూ సమీక్షించాలని సూచించారు.

వినతుల్లో కొన్ని...

- తండ్రి నుంచి సంక్రమించిన భూమి తనకు చెందకుండా తన వాళ్లే ఇబ్బంది పెడుతున్నారని గుంతకల్లు మండలం ములకలపేటకు చెందిన దివ్యాంగుడు పెద్దయ్య ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 102లో 7.50 ఎకరాలు తన తండ్రి నుంచి వచ్చిందని, అయితే, ఆ సర్వే నంబర్‌లో కాకుండా వేరే చోట కొద్దికొద్దిగా భూమి చూపిస్తున్నారన్నారు. జేసీ కేతన్‌గార్గ్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత తహసీల్దారును ఆదేశించారు.
- కాలిపోయిన పంటకు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించి ఆదుకోవాలని బెళుగుప్ప మండలం ఆవులెన్న గ్రామానికి చెందిన తిప్పేస్వామి విన్నవించారు. 7 ఎకరాల్లో ఆముదం పంట వేశానని, పంట కోతకు వచ్చిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మొత్తం కాలిపోయిందని ఆవేదన చెందారు.
- తమ అనుభవంలో ఉన్న భూమిని వేరొకరి పేరున నమోదు చేశారని కంబదూరు మండలకేంద్రానికి చెందిన జూల అనిల్ ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 340–5 పైకి 22సెంట్లు, 340–6 పైకి 11 సెంట్లు, 337–2 పైకి 78 సెంట్ల భూమి తమ అనుభవంలో ఉందని, అయితే భూమిని వేరొకరి పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేశారని వాపోయారు. విచారణ చేసి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వివాదాల కేంద్ర బిందువు!

- మారని బీకేఎస్ స్టేషన్ సీఐల తీరు
- ప్రస్తుత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అదే దారిలో
- ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు కొత్త భాష్యం చెబుతున్నారని విమర్శలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆ స్టేషన్ పేరెత్తితే చాలు వివాదాలు గుర్తుకొచ్చేలా వ్యవహరిస్తున్నారు అక్కడి పోలీసు అధికారులు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు కొత్త భాష్యం చెబుతూ పోలీసు వ్యవస్థకే చెడ్డపేరు తెస్తున్నారు. అనంతపురానికి కూతవేటు దూరంలో ఉన్న బుక్కరాయ సముద్రం పోలీసుస్టేషన్‌కు గడిచిన రెండేళ్లలో ముగ్గురు సీఐలు వచ్చారు. అందరూ తమ తీరుతో వివాదాలకు కేంద్రబిందువుగా మారారు. ఏడాదిన్నర క్రితం ఓ భూవివాదంలో తలదూర్చి అప్పటి సీఐ రాము అడ్డంగా బుక్కయ్యారు. ఒక వర్గానికి కొమ్ముకాసి డబ్బు డిమాండ్ చేయడంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రిమాండుకు పంపించారు. ఆ తర్వాత నాగార్జున రెడ్డి సీఐగా వచ్చారు. ఆయన కూడా వచ్చిన కొన్నాళ్లకే రెచ్చిపోయారు. డ్వాక్రా సంఘాల యానిమేటర్ అయిన ఒక దివ్యాంగుడిని చితకబాదారు. ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. దీంతో ఆయనను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

ప్రస్తుత సీఐదీ అదే తీరు..!

ప్రస్తుతం బీకేఎస్ స్టేషన్ సీఐగా ఉన్న వెంకటేశ్వర్లు తీరు కూడా తాజాగా వివాదాస్పమైంది. స్టేషన్‌కు వచ్చిన బాధితుల పట్ల ఆయన ప్రదర్శించిన వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు.. రెడ్డిపల్లి సెంట్రల్ జైలు పరిధిలో ఉన్న మామిడి చెట్లను సమీపంలోని నీలాంపల్లి రైతు సాంబశివారెడ్డి కౌలుకు తీసుకున్నారు. ఏడాదికి రూ.30 లక్షలు చెల్లిస్తున్నారు. ఇటీవల ఆ తోటలో దొంగలు పడి మామిడికాయలు ఎత్తుకెళ్లారు. సమీప పొలాల రైతులతో కలిసి నిఘా ఉంచిన సాంబశివారెడ్డి దొంగలను పట్టుకుని బుక్కరాయసముద్రం పోలీసుస్టేషన్‌లో అప్పజెప్పారు. అయితే దొంగలను మందలించాల్సిన సీఐ రైతుల పట్ల చులకనగా వ్యవహరించారు. వెటకారంగా మాట్లాడారు. తామే దొంగలను పట్టించి ఇస్తే.. వారిని మందలించకపోగా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారని రైతులు వాపోయారు. స్టేషన్‌కు ఎవరు సీఐగా వచ్చినా ఫ్రెండ్లీ పోలీసింగ్ అనే విషయాన్ని మర్చిపోతున్నారని బీకేఎస్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

28న మెగా జాబ్ మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాదాపు 75 కంపెనీలతో అనంతపురంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల వేదికగా ఈ నెల 28న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫౌండేషన్ అధ్యక్షుడు హరీష్‌కుమార్ యాదవ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐటీ, నాన్ ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా, ఆటోమొబైల్, సెక్యూరిటీస్, మాన్యుఫాక్చరింగ్, ఇన్సూరెన్స్, హెల్త్ సెక్టార్, ఈ–కామర్స్ రంగంలోని దిగ్గజ కంపెనీలైన క్యాప్ జెమిని, వెబ్రోటెక్, ఎడ్యుబ్రిడ్జ్, టీట్సల్, సెవెంటెక్ టెక్నాలజీస్, కోజెంట్, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పేటియం, అమర్ రాజ, కియా మోటర్స్, అపోలో ఫార్మా, హెటిరో ఫార్మా, ముత్తూట్, ఎయిర్‌టెల్, టీవీఎస్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో ప్రతి పేద నిరుద్యోగికి అండగా ఉండటమే తమ లక్ష్యమని హరీష్‌కుమార్ యాదవ్ తెలిపారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియామక పత్రాలు అందజేస్తారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన కొండమీదరాయుని బ్రహ్మోత్సవాలు



హంస వాహనంపై కొండమీదరాయుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకూ వైభవంగా జరిగిన కొండమీదరాయుని బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉత్సవాల్లో భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా ఆలయ కమిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఉదయం తీర్థవాది వసంతోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి హంస వాహనంపై దేవేరులతో కలసి శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు.

రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు శ్రీకారం



అనంతపురం రైల్వే స్టేషన్‌లో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, తదితరులు



గుత్తిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి, తదితరులు

- న్యూఢిల్లీ నుంచి వర్చువల్‌గా పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ

అనంతపురం సిటీ/ తాడిపత్రి అర్బన్/గుత్తి: జిల్లాలోని అనంతపురం, తాడిపత్రి, గుత్తి రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. 'అమృత్ భారత్' పథకంలో భాగంగా సోమవారం న్యూఢిల్లీ నుంచి వర్చువల్‌గా పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అనంతపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, గుత్తిలో గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడారు. లాక్‌డౌన్ సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లతో పాటు మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లనూ పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. దేశ వ్యాప్తంగా 554 రైల్వే స్టేషన్లను ఆధునీకరించడంతో పాటు 1,500 రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లకు ఒకేసారి శంకుస్థాపన చేయడం, ప్రారంభించడం గర్వకారణమన్నారు. అనంతపురం రైల్వే స్టేషన్‌లో రూ.34 కోట్లతో లిఫ్టులు, మెట్లు, ఫ్లాట్‌ఫారంల ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులు చేపట్టిన రైల్వే ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రైల్వే డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మణికంఠ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
- ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళుతున్నారని గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి తెలిపారు. ప్రధాని మోదీ వర్చువల్‌గా పనులు ప్రారంభించిన అనంతరం గుత్తి ఆర్‌ఎస్‌లో సుమారు రూ.8 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ సంజీవ్‌కుమార్, సీనియర్ డీఎంఈ రమేష్, ఎస్‌ఎంఆర్ సురేష్‌బాబు, ఐఓడబ్ల్యూ నాగేశ్వర నాయక్, బుకింగ్ సూపర్ వైజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
- తాడిపత్రిలో రైల్వే స్టేషన్ మేనేజర్ జి.అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ కర్నూలు జిల్లా కన్వీనర్ జంగంరెడ్డి అంకాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర లీగ్ సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో 72 స్టేషన్లను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ నడుం బిగించారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరీష్‌కుమార్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో సరికొత్త అధ్యాయం

- ఆన్‌లైన్ కోర్సుల సంస్థ ఎడెక్స్‌తో జగన్ సర్కార్ ఒప్పందం
- 2 వేలకు పైగా వరల్డ్ క్లాస్ కోర్సులు ఉచితంగా అందుబాటులోకి
- ఎస్కేయూ పరిధిలో 27 వేల మంది విద్యార్థులకు అవకాశం
- లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డ్, ఎంటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి వర్సిటీల నుంచి సర్టిఫికేషన్లు
- విద్యార్థికి వీలున్న సమయంలోనే కోర్సు పూర్తి చేసే వెసులుబాటు


ఎస్కేయూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాలక భవనం

అనంతపురం: విదేశాలకు వెళ్లి చదువుకోలేని పేద, మధ్య తరగతి విద్యార్థులకు జగన్ సర్కార్ సువర్ణావకాశం కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అంతర్జాతీయ వర్సిటీల కోర్సులను ఉచితంగా అందించే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రముఖ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో ఒప్పందం చేసుకుంది. దీంతో ఈ సువర్ణ అవకాశం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనుబంధ పీజీ కళాశాలలతో పాటు జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్, అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఎడెక్స్, ఉన్నత విద్యాశాఖ సంయుక్తంగా టీచింగ్, లెర్నింగ్ కోసం కొత్త టెక్నాలజీ, బోధన విధానాలను రూపకల్పన చేశాయి. హార్వర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, కొలంబియా, న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్స్, ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక వర్సిటీల నుంచి వివిధ కోర్సుల్లో విద్యార్థులు సర్టిఫికేషన్లు సులువుగా పొందవచ్చు. ఈ కోర్సు పూర్తి చేయడం ద్వారా మంచి వేతనాలతో కూడిన జాతీయ, అంతర్జాతీయ ఉద్యోగాలను సాధించేందుకు దోహదం కానుంది.

27 వేల మందికి కోర్సు లబ్ధి..

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో మొత్తం 27 వేల మంది విద్యార్థులకు ఎడెక్స్ లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే విద్యార్థుల వివరాలను ఉన్నత విద్యామండలికి అధికారులు నివేదించారు. వరల్డ్ క్లాస్ వర్సిటీలు, ఇతర విద్యా సంస్థలు అందించే రెండు వేలకు పైగా ఎడెక్స్ ఆన్‌లైన్ కోర్సులను, రెగ్యులర్ కోర్సులతో పాటు ఉచితంగా అభ్యసించవచ్చు. అనంతరం ఎడెక్స్, అంతర్జాతీయ వర్సిటీల నుంచి సర్టిఫికెట్లు అందుకోవచ్చు. ప్రపంచంలోనే అత్యున్నత స్థాయి విశ్వవిద్యాలయాలు, సంస్థలకు చెందిన అత్యుత్తమ అధ్యాపకులతో బోధన లభిస్తుంది. శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు సామాజిక, సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన వివిధ సబ్జెక్టులను పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చారు.

నచ్చిన వర్టికల్స్ చదువుకునేలా...

ఎడెక్స్ కోర్సుల్లో ఎక్కువ వర్టికల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. తద్వారా విద్యార్థి నచ్చిన వర్టికల్స్ చదువుకునేలా ప్రణాళిక రూపొందించారు. విదేశాలకు వెళ్లి అక్కడ మేటి కళాశాలల్లో చదువుకోలేని ఎంతో మంది విద్యార్థులకు ఈ విధానం ద్వారా ఎంతో మేలు చేకూరనుంది. కరిక్యులమ్‌లో భాగంగా ఎడెక్స్ కోర్సులకు అంతర్జాతీయ వర్సిటీలే ఆన్‌లైన్‌లో ఎగ్జామ్స్ నిర్వహించి సర్టిఫికెట్లు అందిస్తాయి. తద్వారా ఏపీ విద్యార్థులు గ్లోబల్ స్టూడెంట్స్‌గా ఎదుగుతారు. ప్రొఫెషనల్, సంప్రదాయ డిగ్రీ విద్యలో లోటుపాట్లను సరిచేసి స్కిల్ ఓరియంటెడ్ కోర్సులను అందించడం ద్వారా నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధిలో ఎడెక్స్ ఎంతో ఉపయోగపడనుంది.

రూ.30 వేల విలువైన కోర్సు ఉచితంగా...

ప్రపంచంలోనే ప్రముఖ ఈ–లెర్నింగ్ ప్లాట్‌ఫాం వేదికగా ఉన్న ఎడెక్స్‌లో 180కి పైగా వరల్డ్‌క్లాస్ వర్సిటీలు రూపకల్పన చేసిన 2 వేల ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క కోర్సు చేయాలన్నా కనీసం రూ.30 వేలు ఖర్చు భరించాల్సి ఉంది. అయితే ఈ కోర్సులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఉచితంగా అందిస్తోంది. ఇందుకోసం ఏడాదికి రూ.50 కోట్లు ఖర్చు చేస్తోంది. డిగ్రీ సెమిస్టర్‌లో ఆరు సబ్జెక్టులు ఉంటే ఒకటి ఎడెక్స్ కోర్సుతో భర్తీ చేస్తారు. అంతర్జాతీయ వర్సిటీలతో కలిసి విద్యార్థి అసైన్‌మెంట్స్, ప్రతిభ ఆధారంగా ఎడెక్స్ సంస్థ సర్టిఫికెట్ అందిస్తుంది. రాత పరీక్షను ఎడెక్స్ రూపొందించిన ప్రశ్నాపత్రంతో వర్సిటీలే నిర్వహిస్తాయి. క్రెడిట్స్‌ను కూడా వర్సిటీలే ఇస్తాయి. ఆసక్తి గల విద్యార్థులు ఒకటి కంటే ఎక్కువ కోర్సులు చేయవచ్చు. వాటిని వాల్యూయాడెడ్ కోర్సులుగా పరిగణించి సర్టిఫికెట్ ఇస్తారు.

ఎడెక్స్ కోర్సు ఇలా...

డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులు తప్పనిసరిగా ఎడెక్స్ కోర్సులు అభ్యసించేలా కరిక్యులమ్‌లో ఓ భాగంగా మార్చేశారు. డిగ్రీ, పీజీ స్థాయిలో రెండు, నాలుగో సెమిస్టర్, ఇంజినీరింగ్ స్థాయిలో రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్‌లో ప్రతి విద్యార్థి వర్సిటీ లేదా కళాశాల ఎంపిక చేసిన ఎడెక్స్ కోర్సులను పూర్తి చేయాల్సి ఉంటుంది. విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా ఎడెక్స్ అందించే అంతర్జాతీయ కోర్సులను అభ్యసించేందుకు అవకాశం ఉంది. ఈ ఆన్‌లైన్ కోర్సులను విద్యార్థులకు వీలున్న సమయంలో పూర్తి చేసే వెసులుబాటు ఉంది. వారానికి నాలుగు గంటల పాటు క్లాసులు ఉంటాయి. ప్రతి విద్యార్థి ప్రత్యేక లాగిన్ ద్వారా మొబైల్ యాప్‌లో పాఠాలు వినవచ్చు. సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఆన్‌లైన్ సపోర్టింగ్ సిస్టమ్‌లో మెంటార్లు అందుబాటులో ఉంటారు.

సువర్ణ అధ్యాయం



ఆంధ్రప్రదేశ్ ఉన్నత చదువుల చరిత్రలో ఇదోక సువర్ణ అధ్యాయం. ప్రపంచంతో పోటీ పడేలా మన విద్యార్థులు మెరుగైన ఉద్యోగాలు సాధించాలి. నాణ్యమైన విద్య ద్వారానే ఇది సాధ్యం. అందుకు విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలు ఉండాలి. అప్పుడే మన విద్యార్థులకు మెరుగైన అవకాశాలు వస్తాయి. ఎడెక్స్ ప్రోగ్రాం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుంది. బయట రూ.35వేల నుంచి 40 వేలు వెచ్చించాల్సిన కోర్సులు ఉచితంగానే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

– ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి, వీసీ, ఎస్కేయూ

క్లుప్తంగా

నేత్రపర్వంగా రంగనాథుడి వసంతోత్సవం


శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడిని ఊరేగిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు మంగళవారం హంసవాహన సేవలతో పాటు వసంతోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయమే ఆలయంలో ప్రధాన అర్చకులు పలుకూరి రవి కుమార్, లిఖిల్‌వర్మ, చేతన్‌వర్మ, ఉదయ్ కుమార్, నవీన్‌కుమార్ విశేష పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను జక్కలచెరువు గ్రామానికి తరలించడంతో ఉత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ దేవదాసు పర్యవేక్షించారు.

ఆటో బోల్తా - ఉపాధ్యాయులకు గాయాలు


పాల్తూరు వద్ద బోల్తాపడిన ఆటో

ఉరవకొండ: ఉపాధ్యాయినిలతో వెళుతున్న ఆటో బోల్తాపడింది. ఘటనలో ఏడుగురు ఉపాధ్యాయినులు గాయపడ్డారు. వివరాలు... విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామ పాఠశాలలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయినిలు రోజూ ఆటోలో ఉరవకొండ నుంచి పాల్తూరుకు వెళ్లి విధులు నిర్వర్తించి, తిరిగి వచ్చేవారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఉరవకొండ నుంచి ఉపాధ్యాయినులతో బయలుదేరిన ఆటో ఉండబండ వద్దకు చేరుకోగానే వీరభద్రస్వామి గుడి వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పాల్తూరులోని ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయినిలు రాధ, శైలజ, కవిత, ఈశ్వరి, గౌతమి, పాల్తూరు మెయిన్ స్కూల్ ఉపాధ్యాయినిలు హేమలక్ష్మమ్మ, లక్ష్మీకళ, కవిత తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న హేమలక్ష్మమ్మకు ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

కారు ఢీకొని యువకుడి మృతి


శివ (ఫైల్)

పామిడి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... పామిడి మండలం జి.కొట్టాలకు చెందిన బసప్ప కుమారుడు శివ (20), నీలూరు గ్రామానికి చెందిన సురేష్ సోమవారం ఉదయం వ్యక్తిగత పనిపై గుత్తికి వెళ్లారు. పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు గజరాంపల్లి సమీపంలోని శ్రీచక్ర మిల్క్ డెయిరీ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో ద్విచక్ర వాహనం వెనుక కూర్చొన్న రోడ్డుపై పడడంతో శివ తల పగిలింది. సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే పామిడిలోని సీహెచ్‌సీకి తరలించారు. చికిత్స పొందుతూ శివ మృతి చెందాడు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సురేష్‌ను అనంతపురంలోని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రాజశేఖరరెడ్డి తెలిపారు.

భార్య హత్య కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తాడిపత్రి అర్బన్: భార్యను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి అర్బన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం సాయంత్రం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ రామకృష్ణతో కలసి నిందితుడి వివరాలను ఆయన వెల్లడించారు. పుట్లూరు మండలం గరుగుచింతలపల్లికి చెందిన నడిమంటి రామాంజినేయులు, అరుణ దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలసి తాడిపత్రిలోని జయనగర్‌కాలనీలో నివాసముంటున్నారు. రామాంజినేయులు గతంలో పెన్నా సిమెంటు పరిశ్రమలో పని చేసేవాడు. మద్యానికి బానిసగా మారి జల్సాలకు అలవాటుపడి విధులకు దుమ్మా కొడుతుండడంతో ఆయనను పరిశ్రమ యాజమాన్యం తొలగించింది. దీంతో జల్సాలకు అలవాటుపడిన రామాంజినేయులు జూదమాడేందుకు విచ్చలవిడిగా అప్పులు చేసి వాటిని తీర్చలేక తన స్వగ్రామంలో ఉన్న 3 ఎకరాల చీనీ తోటను తన అన్న కొడుకు రాముకు రూ.17లక్షలకు విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకు సంబంధించి అడ్వాన్స్‌గా రూ.6.50లక్షలు తీసుకున్నాడు. ఈ డబ్బులో కొంతమేర వడ్డీ వ్యాపారులకు చెల్లించాడు. విషయం తెలుసుకున్న భార్య అరుణ వచ్చిన డబ్బును ఇలా ఖర్చు చేస్తే కూతురి వివాహం ఎలా చేస్తావని భర్తను నిలదీసింది. తన కూతురి భవిష్యత్తు కోసం రూ.5లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేయాలని వాగ్వాదానికి దిగింది. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ తారాస్థాయికి చేరుకోవడంతో పక్కనే ఉన్న రోకలిబండతో అరుణ తలపై రామాంజినేయులు దాడి చేసి పారిపోయాడు. రక్తపు మడుగులో పడి ఉన్న అరుణను ఇరుగుపొరుగు వారు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న రామాంజినేయులు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోబోగా పోలీసులు సకాలంలో అక్కడకు చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సోమవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో బేల్దారి మృతి


మృతుడు సాకే నల్లప్ప

రాప్తాడు: విద్యుదాఘాతానికి గురై ఓ బేల్దారి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం బుక్కచెర్లకు చెందిన సాకే లక్ష్మయ్య కుమారుడు నల్లప్ప (26) బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండేళ్ల క్రితం ఆయనకు వివాహమైంది. గ్రామంలో ఎస్సీ కాలనీలో నూతన ఇంటిని నిర్మించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇంటి నిర్మాణానికి సంబంధించి గోడలకు క్యూరింగ్ చేసేందుకు సోమవారం మోటార్ స్విచ్ ఆన్ చేయగానే కరెంట్ షాక్‌కు గురై కుప్పకూలాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు జయప్రదం చేయండి

అనంతపురం అర్బన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆధ్వర్యంలో సోమవారం నుంచి మార్చి 1వ తేదీ వరకూ జరిగే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను జయప్రదం చేయాలని జెడ్పీ సీఈఓ నిదియా దేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసి కార్యక్రమంలో వారోత్సవాల పోస్టర్లను వారు ఆవిష్కరించారు. వారోత్సవాల ప్రాముఖ్యతను ఎల్‌డీఎం సత్యరాజ్ వివరించారు. ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులను చైతన్య పరచడమే వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం మునిసిపల్ పాఠశాలల్లోని 8, 9, 10వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.2వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1,200, తృతీయ బహుమతి కింద రూ.800 అందజేస్తారన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ రూ.500 చొప్పున ప్రోత్సాహక బహుమతి అందిస్తామన్నారు. అలాగే మునిసిపల్ పాఠశాలల్లోని 8, 9, 10వ తరగతి విద్యార్థులకు 28నన, డిగ్రీ విద్యార్థులకు 29న క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో ఇద్దరు విద్యార్థులు ఓ జట్టుగా ఏర్పడి పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇందులో విజేత జట్టుకు ప్రథమ బహుమతి కిందరూ.4 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, తృతీయ బహుమతి కింద రూ.2 వేలు, పాల్గొన్న విద్యార్థులందరికీ రూ.500 చొప్పున ప్రోత్సాహక బహుమతి అందజేస్తామన్నారు. మార్చి 1న ఆర్థిక అక్షరాస్యత ముగింపు కార్యక్రమంలో బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, ఆర్‌డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్లు వరప్రసాద్, ఆనంద్, పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం

- జర్నలిస్ట్ స్టేట్ క్రికెట్ టోర్నీ ప్రారంభంలో ఎస్పీ అన్బురాజన్


మాంఛోఫెర్రర్‌ను సన్మానిస్తున్న ఎస్పీ అన్బురాజన్, మచ్చా రామలింగారెడ్డి

అనంతపురం: క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం అలవడుతాయని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అన్నారు. అనంత క్రీడాగ్రామం వేదికగా ఆర్డీటీ ప్రధాన స్టేడియంలో ఏపీడబ్ల్యూజేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీసత్యసాయి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎస్పీతో పాటు భారతజట్టు మహిళా క్రికెటర్ అనూష, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ హాజరై, మాట్లాడారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశానికి ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి అధ్యక్షత వహించారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ అన్బురాజన్, మాంఛోఫెర్రర్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి జర్నలిస్టు క్రికెట్ టోర్నీని అనంతపురంలో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. టోర్నీలో పాల్గొనేందుకు వచ్చిన 16 జట్ల క్రీడాకారులను అభినందించారు. మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ... ఏటా జర్నలిస్టుల కోసం ఐపీఎల్ తరహాలో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. జర్నలిస్టులు కూడా అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ఆర్డీటీ క్రీడా మైదానంలో క్రికెట్ ఆడుతుండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆర్డీటీ సహకారంతో ఐదు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా నుంచి భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన అనూషను ఎస్పీ అన్బురాజన్, మాంఛోఫెర్రర్, మచ్చా రామలింగారెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం కర్నూలు, అనకాపల్లి జట్ల మధ్య తొలి మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఎస్ఎస్ ఖాన్, విజయ్, షాకీర్, వెంకటేష్, శివప్రసాద్, చక్రి, హర్ష, అరవింద్, రఘు, యోగి, శివ, రవి, శ్రీకాంత్, బాషా, వైజాగ్ నాగరాజు, కడప చంద్రశేఖర్, బద్వేల్ గురుస్వామి పాల్గొన్నారు.

ఉద్యోగుల ప్రయోజనాలకు ప్రాధాన్యత

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 46 మంది అటెండర్లకు ల్యాబ్, రికార్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతులు


పదోన్నతులు పొందిన ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు

అనంతపురం సిటీ: ఉద్యోగుల ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పని చేస్తున్న 46 మంది అటెండర్లకు ల్యాబ్, రికార్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. వీరికి అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఉత్తర్వులను సోమవారం ఆమె అందజేసి, మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఏళ్ల తరబడి పదోన్నతులు లేక పంచాయతీరాజ్ ఉద్యోగులు నలిగిపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉద్యోగుల సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఫలితంగా అన్ని క్యాడర్ల వారికి పదోన్నతులు దక్కుతున్నాయన్నారు. తాజాగా ఒకేసారి 46 మందికి పదోన్నతులు కల్పిస్తూ, ఉత్తర్వులు అందజేయడం జెడ్పీ చరిత్రలోనే ఓ సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందన్నారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులు కూడా తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం పదోన్నతులు పొందిన ఉద్యోగులు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కేక్ కట్ చేయించి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు చంద్రమోహన్, భూతరాజ్, పరిపాలనాధికారులు భాస్కర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, ధనుంజయ, 'ఏ' సెక్షన్ ఉద్యోగులు శిరీష, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

బ్రహ్మసముద్రం: వడదెబ్బ సోకి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లికి చెందిన హరిజన సన్నలింగప్ప (55) సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని కప్పలకొండ చెరువులో కట్టెలు కొట్టేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఎండ తీవ్రతకు తాళలేక అక్కడే కుప్పకూలిపోయాడు. 3 గంటల సమయంలో అటుగా వెళ్లిన మేకల కాపర్లు గుర్తించి సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కాళ్లపై బొబ్బలు తేలి ఉన్నాయి. ఘటనపై బ్రహ్మసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేడు ఉద్యోగుల స్పందన

అనంతపురం మెడికల్: ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.శ్రీనివాస్ ఆదేశాల మేరకు మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఉద్యోగుల జీతభత్యాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం మొదలు కానుంది.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

అనంతపురం: ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలురించారు. ఇది వరకు కింది కోర్టు ఇచ్చిన తీర్పునే సమర్థిస్తూ తీర్పు వెలువరించడం గమనార్హం. వివరాలు... గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామానికి చెందిన పి.ఉమాదేవి, రవిశంకర్ దంపతులు ఆర్థిక అవసరాల కోసం తాముంటున్న ఇంటిని అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి కృష్ణారెడ్డి వద్ద రూ.2.70 లక్షలకు తాకట్టు పెట్టారు. ఈ క్రమంలో ఉన్నఫళంగా ఇంటిని విడిపించుకోవాలని, లేకుండా వదులుకోవాలంటూ తరచూ రవిశంకర్‌పై ఒత్తిడి తీసుకెళ్లాడు. ఇందుకు కొత్తపల్లి చలమాపతి ఒత్తాసు పలికాడు. వారి ఒత్తిళ్లను తాళలేక అప్పట్లో రవిశంకర్ క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై 2015, డిసెంబర్ 22న గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి, పక్కా ఆధారాలతో రవిశంకర్‌ను ఆత్మహత్యకు ప్రేరేపించిన కొత్తపల్లి కృష్ణారెడ్డి, చలమాపతిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ఇద్దరికీ మూడేళ్ల జైలు శిక్ష, చెరో రూ.10 వేలు జరిమానా విధిస్తూ అప్పట్లో అనంతపురం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి తీర్పు వెలువరించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ముద్దాయిలు జిల్లా కోర్టుకు అప్పీలు చేసుకున్నారు. కేసు వాదనలు సమగ్రంగా విన్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్... గతంలో అనంతపురం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ అదే శిక్షను ఖరారు చేస్తూ తీర్పు వెలురించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను పీపీ ఆర్.హరినాథరెడ్డి వినిపించారు. ముద్దాయిలకు శిక్ష పడేలా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

నవ వధువు ఆత్మహత్య


పూజిత

గార్లదిన్నె: మండలంలోని పాత కల్లూరులో సోమవారం ఓ నవ వధువు ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం ఎగువపల్లికి చెందిన దేవేంద్ర కుమార్తె పూజిత(22)ను ఐదు నెలల క్రితం పాత కల్లూరుకు చెందిన లోకేష్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె క్రిమి సంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన ద్విచక్రవాహనంపై సమీపంలోని పామిడిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ పామిడి ప్రభుత్వాస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా, ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్–2024 డైరీని సోమవారం జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏపీఏఈఎస్ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, రాజేంద్ర ప్రసాద్, కార్యవర్గ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

అనంతపురం మెడికల్: ప్రతి పీహెచ్‌సీ పరిధిలో కొత్త కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి. అలాగే వారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కుష్టు వ్యాధి విభాగం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లాలోని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్లకు నెలవారీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ.. కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో వైద్యం అందిస్తే అంగవైకల్యం గురికాకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు జాన్ పీటర్, సిబ్బంది డాక్టర్ శివారెడ్డి, పారామెడికల్ అధికారి నాగన్న హెచ్ఈఓ సత్యనారాయణ, సూర్యప్రకాష్‌రెడ్డి, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



జేసీ కేతన్‌గార్గ్‌కు సమస్యలు విన్నవిస్తున్న డ్వామా సిబ్బంది

అనంతపురం అర్బన్: తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు డ్వామా సిబ్బంది విన్నవించారు. సోమవారం రెవెన్యూ భవన్‌లో జేసీని సంఘం నాయకులు రామాంజనేయులు, శేషు, బాషా, సిబ్బంది కలిశారు. సమ్మె నోటీసు అందజేసి డిమాండ్లను వివరించారు. ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న సిబ్బందికి గ్రేడ్ ఫిక్సేషన్ చేయాలన్నారు. 23 శాతం పీఆర్సీ అమలు చేయాలని కోరారు. మూడేళ్లు పూర్తి చేసుకున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందిని ఎఫ్‌టీఈలుగా మార్పు చేయాలన్నారు. 2018లో ఎఫ్‌టీఈలుగా మారిన ఓఎస్ సిబ్బంది సర్వీస్‌ను కలపాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు.

'స్పందన'కు 10 ఫిర్యాదులు

అనంతపురం కార్పొరేషన్: కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన స్పందనకు 10 ఫిర్యాదులు వచ్చాయి. ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాలకు ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం చూపాలని డీసీ వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ మారుతీ ప్రసాద్, ఈఈలు సూర్యనారాయణ, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

9 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

రాయదుర్గం రూరల్: మండలంలోని ఆర్పీ వంక (బొందనకల్లు) గ్రామంలో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. వారి నుంచి రూ.3,950 స్వాధీనం చేసుకొని, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

5న పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం



కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రధాన అర్చకులు, శివమాలధారులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్ట సమీపంలోని కాశీ విశాలాక్షి సహిత కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో మార్చి ఐదో తేదీన పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నామని ప్రధాన అర్చకులు కైప ద్వారకనాథ్‌శర్మ తెలిపారు. కల్యాణోత్సవ కరపత్రాలను సోమవారం ఆలయంలో శివమాలధారులతో కలిసి ప్రధాన అర్చకులు విడుదల చేశారు. ఐదో తేదీ సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం, 6న సాయంత్రం 6.30 గంటలకు పురవీధుల్లో గ్రామోత్సవం ఉంటుందన్నారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

- ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం
- మోసం చేయడమే చంద్రబాబు నైజం
- ఎన్ని పార్టీలు కలిసొచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయం
- 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



స్టాలిన్ నగర్‌లో పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం ఏ.నారాయణపురం పంచాయతీ పరిధిలోని స్టాలిన్‌నగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరై ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. పాలనలో సమూల మార్పులు తీసుకురావాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేసేందుకు అక్కడి ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవడం తమకెంతో గర్వకారణమన్నారు. చంద్రబాబు పాలనంతా అబద్ధాలు మోసాలతోనే సాగిందన్నారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు గుప్పించడం అధికారంలోకి రాగానే హామీలను విస్మరించి ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికల సమయంలో రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి.. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ఆయా వర్గాలను ఏ విధంగా మోసం చేశారో ప్రజలు ఇంకా మరచిపోలేదన్నారు. పవన్ కళ్యాణ్ తన స్వార్థం కోసం యువత జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. టీడీపీ, జనసేనతో పాటు ఎన్ని పార్టీలు జతకట్టి వచ్చినా తాము బయపడే ప్రసక్తే లేదన్నారు. తాము ఎప్పుడూ ప్రజల సంక్షేమం కోసం ప్రజల మధ్యనే ఉన్నామన్నారు. కరోనా కష్టకాలంలో సైతం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సంక్షేమ పథకాలు అములు చేశామన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అములు చేసి ప్రజలకు అండగా నిలిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కావాలో అధికారం కోసం మభ్యపెట్టే పార్టీలు కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు.

నగరానికి దీటుగా పంచాయతీల అభివృద్ధి

నగరానికి దీటుగా నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీలను అన్ని విధాలా అభివృద్ధి చేశాం. గత ప్రభుత్వ హయాంలో కేవలం దోచుకోవడం దాచుకోవడమే పనిగా పెట్టుకున్న టీడీపీ నాయకులు అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన ఈ ఐదేళ్ల కాలంలో దాదాపు రూ.100 కోట్ల నిధులతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుతో పాటు అన్ని మౌలి వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతీ సాహిత్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్ వలి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెల వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్ మోహన్‌రెడ్డి, గువ్వల రమణారెడ్డి, సత్యన్న, మనోజ్ కుమార్‌రెడ్డి, రామ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 17వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 17వ డివిజన్‌లో మంగళవారం ఉదయం 7:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని కోర్టు రోడ్డు వద్ద ఉన్న నెహ్రూ మునిసిపల్ స్కూల్ నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

ఆలయానికి రూ.12 లక్షల విరాళం





నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయం, అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, బెడదూరి గోపాల్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లిలోని ముత్యాలమ్మ ఆలయ జీర్ణోద్ధరణకు రాప్తాడు మార్కెట్‌యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్‌రెడ్డి రూ.12 లక్షలు విరాళంగా అందజేశారు. ఇటీవల ఆలయం మొత్తం మరమ్మతులు చేయించి.. గోపురం ప్రతిష్ఠించారు. జీర్ణోద్ధరణ వేడుకలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించగా.. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డితో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బెడదూరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తన సొంతూరిలో ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందించానన్నారు. అందరి సహకారంతో ఆలయ జీర్ణోద్ధరణ జరిగినట్లు తెలిపారు.

క్యాన్సర్ బాధితుడికి అమ్మ ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఓ క్యాన్సర్ బాధితుడికి అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి అండగా నిలిచారు. వివరాలు.. నగరంలోని మూడవ రోడ్డులో నివాసం ఉంటున్న జగదీష్ కుమార్ ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామం నుంచి అనంతకొచ్చి స్థిరపడ్డాడు. అవివాహితుడైన ఆయన పౌరోహిత్యంతో పాటూ చిన్నా చితకా పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. రెండేళ్ల కిందట బైపాస్ సర్జరీ చేయించుకున్నాడు. దీనికి తోడు న్యుమోనియా సోకి 20 రోజుల పాటు కోమాలో ఉన్నాడు. తర్వాత కోలుకున్నా కొన్ని రోజుల కింద లంగ్ కాన్సర్ సోకినట్లు హైదరాబాద్‌కు చెందిన వైద్యులు నిర్ధారించారు. కిమో థెరపీ చేయించుకోవడానికి శరీరం సహకరించక పోవడంతో గిద్దలూరులోని ఆయుర్వేద మందులు తీసుకుంటున్నాడు. జగదీష్ కుమార్ దీన పరిస్థితిని తెలుసుకున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి సోమవారం అతడ్ని పరామర్శించారు. రూ.70 వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్తులో వైద్య ఖర్చులు భరిస్తానని హామీ ఇచ్చారు.

మెడికల్ స్టోర్‌లో చోరీ

యాడికి: తాళాలు పగులగొట్టి మెడికల్ స్టోర్ దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు చొరబడి నగదు దోచుకెళ్లారు. సోమవారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న యజమాని రవి షాపు వద్దకు వెళ్లాడు. షాపులోని రూ.40 వేలు కనబడక పోవటంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తొండపాడు హుండీ ఆదాయం రూ.3.63 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న అధికారులు

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలో బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల్లోని కానుకలను లెక్కించగా రూ.3.63.905 ఆదాయం వచ్చినట్లు ఈఓ దేవదాసు తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో ఉత్సవ ప్రత్యేక అధికారి పాండురంగా రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 25 వరకూ బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీల్లో భక్తులు వేసిన నగదును లెక్కించగా రూ.3.63.905 ఆదాయం లభించింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలు మోహన్ పాల్గొన్నారు. ఎస్ఐ నబీరసూల్ బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థి అదృశ్యం



అసిఫ్ బాషా

యాడికి: విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేశామని సీఐ నాగార్జున రెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన హాజీబాషా కుమారుడు అసిఫ్ రాజా మదనపల్లెలో బీటెక్ చదువుతున్నాడు. ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో కొన్ని సబ్జెక్టులు తప్పడంతో కుమారుడిని తండ్రి మందలించాడు. దీంతో ఈ నెల 15న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం తెలియకపోవడంతో.. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టపాడుకు చెందిన ఓబుళరెడ్డి, శ్రీరాములు గుత్తికి బైక్‌లో వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా కొత్తపేట శివారులోని బైపాస్ బ్రిడ్జి వద్ద పామిడి మండలం ఎదురూరు గ్రామానికి చెందిన గణేష్ ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. 108 ద్వారా క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు తీవ్రంగా గాయపడిన ఓబుళరెడ్డిని అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఈఓ ఆనంద్ కుమార్

రాప్తాడు: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందాలని ఎస్వీఐటీ కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని హంపాపురం సమీపంలో ఉన్న ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఎమెర్జింగ్ టెక్నిక్స్ అండ్ టూల్స్ ఇన్ సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ అనే అంశంపై 5 రోజుల శిక్షణ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలన్నారు. సమాజాన్ని నడిపించేంది విజ్ఞానమే అని తెలిపారు. నూతన టెక్నాలజీ పాముఖ్యతను వివరించారు. ఇలాంటి వర్క్ షాపులను కళాశాలలో నిర్వహించడం వలన విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఎండీ రమాకాంత్ రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, ప్రిన్సిపాల్ విష్ణువర్దన్, ఏఓ వెంకట శివా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ విజయ భాస్కర్, సీఎస్ఈ విభాగపతి రంగస్వామి, సీఎస్‌డీ విభాగపతి షరిఫ్, సీఎస్ఎం విభాగపతి బాలజీ, కో–ఆర్డినేటర్లు శివలక్ష్మి, రాఘవ రాజు తదితరులు పాల్గొన్నారు.

అనంత పీజీ విద్యార్థినికి బంగారు పతకం



డాక్టర్ మండల హర్షితను అభినందిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలోని సామాజిక వైద్య శాస్త్ర విభాగంలో ఫైనల్ ఇయర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యనభ్యసిస్తున్న డాక్టర్ మండల హర్షిత బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు పీజీ విద్యార్థిని డాక్టర్ మండల హర్షితను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం కళాశాలకే గర్వకారణమన్నారు. జాతీయ ఆరోగ్య సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 18 నెలల వ్యవధి ఎప్లాయిడ్ ఎపిడమియోలజీ కోర్సులో హర్షిత ప్రథమ స్థానం సాధించారన్నారు. ఇటీవల ఢిల్లీలోని జరిగిన కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంస్థ డైరెక్టర్ హెల్త్ జనరల్ అజిల్ గోయల్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సామాజిక వైద్య విభాగ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ తెలుగు మధుసూదన్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఎస్సీలకు న్యాయం చేయాలి



స్పందనలో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు బీసీఆర్ దాస్

అనంతపురం అర్బన్: ఎస్సీలకు ఇచ్చిన స్థలాల రద్దు విషయంలో న్యాయం చేయాలంటూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ చైర్మన్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బీసీఆర్ దాస్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పురుగు మందు తాగేందుకు సిద్ధపడ్డాడు. గమనించిన పోలీసులు అడ్డుకున్నారు. అప్పటికే కొంత మంది దాస్ తాగేయడంతో స్పృహ తప్పి కింద పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆయన్ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇదీ సమస్య..

అనంతపురం రూరల్ మండలం కురుగుంట వద్ద 2010లో సర్వే నెంబరు 41–1లో 143 మంది ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు పట్టాలు ఇచ్చారని దాస్ తెలిపారు. అదే విధంగా 2013లో సర్వే నంబర్ 41–1, 41–3లో 98 మందికి పట్టాలిచ్చారన్నారు. మళ్లీ 2017లో 37 మందికి మొత్తం 278 మంది ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు పట్టాలిచ్చినిట్లు పేర్కొన్నారు. అయితే పట్టాలను రద్దు చేశామని చెబుతూ.. స్థలాల్లో ఇంటి నిర్మాణం కోసం నాటుకున్న బండలను పగలకొట్టడంతో పేదలు రూ.2.35 లక్షలు నష్టపోయారన్నారు. పట్టాల రద్దు విషయంలో న్యాయం చేయాలని కోరుతూ 68 రోజులుగా స్థలం వద్ద రిలే దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ విషయంలో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. పురుగ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



శివపార్వతుల కల్యాణోత్సవ దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో మాఘ మాసం మూడో సోమవారం ఆలయ కమిటీ, శివమాలధారులు, భక్తుల ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట నడుమ అభిజిత్ లగ్నంలో శివపార్వతుల పెళ్లి తంతును ప్రధాన అర్చకుడు రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. వేదపండితులు చంద్ర, అనిల్ మంత్రోచ్చరణల నడుమ శివమాలధారుల శివనామస్మరణ, మంగళవాయిద్యాల మధ్య కల్యాణ కర్తలు ప్రదీప్, రాహుల్ దంపతుల సంయుక్త సారథ్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అశ్వత్థంలో హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న దేవదాయశాఖ అధికారులు

పెద్దపప్పూరు: అశ్వర్థంలో మాఘమాసం తొలి ఆదివారం తిరుణాల సందర్భంగా భక్తులు హుండీల్లో వేసిన కానుకలను సోమవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యం నేతృత్వంలో లెక్కించారు. తాత్కాలిక హుండీల నుంచి రూ.7,95,600, పర్మినెంటు హుండీల ద్వారా 2,39,939 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

యాడికి: సెబ్ కేసుల్లో పట్టుబడిన తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలన్నారు.

అక్కదేవతల విగ్రహ ప్రతిష్ట

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వర్థనారాయణ స్వామి క్షేత్ర సమీపంలో పెన్నానది ఒడ్డున నూతనంగా నిర్మించిన అక్కదేవతల ఆలయంలో సోమవారం అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోంగా హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

బుక్కరాయసముద్రం: ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని మండల వైద్యులు స్వాతి లక్ష్మి, తెహరున్నీసా అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్‌గా పనిచేస్తున్న భవానికి కర్నూలు జిల్లాలో స్టాఫ్ నర్స్‌గా ఉద్యోగం వచ్చినందుకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్ చెన్నమ్మ, ఫార్మసిస్ట్ బాషా, టెక్నీషియన్ శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్లు, మిడ్ లెవల్ ప్రొవైడర్స్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఆలయానికి పూర్వ వైభవం



నిర్మాణంలో ఉన్న కామితార్థ గణపతి ఆలయం



నవగ్రహ పూజలు నిర్వహిస్తున్న పండితులు

అనంతపురం కల్చరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన కామితార్థ గణపతి ఆలయానికి పూర్వ వైభవం వచ్చేలా పునః ప్రతిష్ఠలు సాగుతున్నాయి. పీటీసీ వద్ద జిల్లాలో మరెక్కడా లేని విధంగా ఆలయ ప్రాకారంపై 32 గణపతి రూపాలను ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటూ సాగే వేడుకల్లో భాగంగా సోమవారం తొలిరోజు ఉదయం గోపూజలు, గణపతి పూజ, రుత్విగ్వరుణం, యాగశాల ప్రవేశం, వాస్తు మండల ఆరాధన, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సుంకేశుల సత్యనారాయణ మాట్లాడుతూ.. మహాగణపతి పంచాయతనం, నవగ్రహ, దత్తాత్రేయ, వేదగాయత్రి, ప్రసన్నాంజనేయస్వామి, నాగదేవతా పునః ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు చతుర్వేద పారాయణం, జపాలు, అధివాస కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. బుధవారం జరగనున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి గోపాలకృష్ణ మఠం కర్నాటక నుంచి ప్రఖ్యాత ఆధ్యాత్మికవేత్త గోవిందానంద సరస్వతి స్వామీజీ హాజరవుతారన్నారు.

డిజిటల్ సర్వీసులపై అవగాహన

బుక్కరాయసముద్రం: విద్యార్థులు చదువుతో పాటు ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ సర్వీసులపై అవగాహన పెంపొందించుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగవేణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీకి చెందిన విద్యార్థులు ఒకేషనల్ ఎక్సికేషనల్‌లో భాగంగా గాంధీనగర్‌లో ఉన్న సచివాలయం–4ను సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో పేదలకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. తక్కువ కాల వ్యవధిలో ప్రజలు సర్టిఫికెట్లు ఏ విధంగా పొందుతున్నారో సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనల్ దివ్యవాని, నాగేంద్రమ్మ, రమాదేవి, లక్ష్మిదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం రూరల్: బోరంపల్లిలో ఉన్న పాలటెక్నిక్ కళాశాలలో సర్వేయర్, ఎలక్ట్రీషియన్ కోర్సులకు శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు మూడు నెలల శిక్షణకు మార్చి 15లోపు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 9490716015, 9701862179లో సంప్రదించాలన్నారు.